


EVENING EDITION

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
12-04-2025
పేజీలు: 02


## ఐపీఎల్‌లో నేడు




## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| గుజరాత్ | 5 | 4 | 1 | 8 |
| ఢిల్లీ | 4 | 4 | 0 | 8 |
| కోల్‌కత్తా | 6 | 3 | 3 | 6 |
| ఆర్సీబీ | 5 | 3 | 2 | 6 |
| పంజాబ్ | 4 | 3 | 1 | 6 |
| లక్నో | 5 | 3 | 2 | 6 |
| రాజస్తాన్ | 5 | 2 | 3 | 4 |
| ముంబై | 5 | 1 | 4 | 2 |
| చెన్నై | 6 | 1 | 5 | 2 |
| సన్‌రైజర్స్ | 5 | 1 | 4 | 2 |

ఆరెంజ్ క్యాప్
288
ఐపీఎల్ అత్యధిక రన్స్

పర్పుల్ క్యాప్
12
ఐపీఎల్ అత్యధిక వికెట్స్

# తిరుపతికి వెళ్లే వారి కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు

వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నుంచి మచిలీపట్నం మధ్య దక్షిణ మధ్య రైల్వే 14 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 13 నుంచి మే 25 వరకు ప్రతి ఆదివారం తిరుపతి నుంచి రైలు బయలుదేరుతుంది. అలాగే మచిలీపట్నం నుంచి ఏప్రిల్ 14 నుంచి మే 26 వరకు ప్రతి సోమవారం రైలు తిరుపతికి బయలుదేరుతుంది. ఈ రైళ్లు పలు స్టేషన్లలో ఆగనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఏప్రిల్ 13 నుంచి తిరుపతి మచిలీపట్నం ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. మే 25 వరకు ప్రతి ఆదివారం ఈ ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయి. 07121 నంబర్‌తో తిరుపతి - మచిలీపట్నం రైలు ప్రతి ఆదివారం రాత్రి 10 గంటల 20 నిమిషాలకు తిరుపతి రైల్వేస్టేషన్‌లో బయల్దేరుతుంది. ఈ రైలు మరుసటి రోజు ఉదయం 7 గంటల 30 నిమిషాలకు మచిలీపట్నం చేరుకుంటుంది. అలాగే 07122 నంబర్‌తో మచిలీపట్నం తిరుపతి ప్రత్యేక రైలు నడవనుంది. ఏప్రిల్ 14వ తేదీ నుంచి మే 26 వరకు ప్రతి సోమవారం ఇది అందుబాటులో ఉంటుంది. ప్రతి సోమవారం సాయంత్రం 5 గంటల 40 నిమిషాలకు మచిలీపట్నంలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 3 గంటల 20 నిమిషాలకు తిరుపతి చేరుకుంటుందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. రేణిగుంట, గూడూరు, నెల్లూరు రైల్వేస్టేషన్, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, పెడన రైల్వేస్టేషన్లలో ఈ ప్రత్యేక రైళ్లు ఆగనున్నాయి. ఇందులో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్‌తో పాటు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని చర్లపల్లి, శ్రీకాకుళం రోడ్ స్టేషన్ల మధ్య కూడా ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది.





## నల్లగొండలో దారుణం.. కలర్ ల్యాబ్ ఓనర్ సురేశ్ హత్య

నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి దారుణ హత్య జరిగింది. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనే గుర్తుతెలియని దుండగులు వేటకొడవళ్లతో ఓ వ్యక్తిని నరికి చంపేశారు. రామగిరి ప్రాంతంలోని గీతాంజలి కాంప్లెక్స్‌లో సురేశ్ (37) మణికంఠ లేజర్ కలర్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో సురేష్ ల్యాబ్‌లో ఉండగా, గుర్తు తెలియని దుండగులు మాస్కులతో వచ్చి వేట కత్తులతో ఒక్కసారిగా దాడిచేశారు. గుండెలో, మెడపై దారుణంగా నరికారు. తప్పించుకునే ప్రయత్నం చేసినా దుండగులు వదిలిపెట్టలేదు. దీంతో ఘటనా స్థలంలోని ఆయన మృతిచెందారు. కుటుంబ కలహాలా, పాత కక్షలు ఏమైనా ఉన్నాయా..? అనే కోణంలో టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ శివరాం రెడ్డి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు.

# ఆస్తి కోసం కూతురిని చంపిన సవతి తల్లి.. వెలుగులోకి షాకింగ్ విషయాలు

మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఆస్తికోసం సవతితల్లే కూతురిని హత్య చేసింది. సవతితల్లి లలిత, తన మేనమామ రవి, స్నేహితుడు వీరన్నలతో కలిసి మహేశ్వరి (26)ని హత్య చేసింది. పెళ్లి కానుకగా మహేశ్వరీ తండ్రి ఇల్లు ఇవ్వబోతున్నారన్న కోపంతో గత డిసెంబర్ 7న చున్నీతో గొంతు బిగించి హత్య చేసి, మృతదేహాన్ని వంగమర్తి వద్ద మూసీలో పాతిపెట్టారు. ఈ నెల 2న తండ్రి ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ శ్రీలక్ష్మీనగర్‌కు చెందిన పీనానాయక్ అనే వ్యక్తి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. బంధువుల కుటుంబానికి చెందిన మహిళతో అతనికి 30 ఏళ్ల క్రితం వివాహమైంది. కుమారుడు, కుమార్తె పుట్టిన తర్వాత విభేదాలతో విడిపోయారు. 2003లో పీనా నాయక్ లలిత అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. కూమార్తె తండ్రి పోషణలో, కుమారుడు తల్లి పోషణలో ఉండేలా మొదటి భార్యతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రెండో భార్యతో పీనా నాయక్‌కు ఓ కుమార్తె ఉంది. మొదటి భార్యకు పుట్టిన మహేశ్వరి తండ్రి వద్దనే ఉంటూ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. కొంతకాలం ప్రైవేటు ఉద్యోగం చేసింది. అక్కడ పరిచయమైన యువకుడితో ఆమెకు వివాహమైంది. భర్తతో విభేదాలు రావడంతో విడాకులు తీసుకుంది. మహేశ్వరికి మరో పెళ్లి చేయాలని తండ్రి పీనా నాయక్ ప్రయత్నం చేశాడు. రెండో పెళ్లికి పెద్దఎత్తున



లాంఛనాలు డిమాండ్ చేస్తుండటంతో బోడుప్పల్‌లో ఉన్న రెండు ఇళ్లలో ఒకదానిని మహేశ్వరికి ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చాడు. గతేడాది నవంబర్‌లో మహేశ్వరికి పెళ్లి సంబంధం కుదిరింది. అనుకున్నట్టుగానే తన ఇంటిని కాబోయే అల్లుడికి రాసిచ్చేందుకు అంగీకారం తెలిపాడు. మహేశ్వరికి ఆస్తిలో వాటా ఇవ్వడాన్ని సవతి తల్లి లలిత జీర్ణించుకోలేకపో యింది. ఇదే విషయంపై భర్తతో గొడవకు దిగింది. భర్త తన మాట పెడచెవిన పెట్టడంతో తట్టుకోలేకోలేకపోయింది. సూర్యాపేట జిల్లా కొమ్మల్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్న మరిది బానోత్ రవిని పరిష్కార మార్గం కోరిం ది. మహేశ్వరిని అడ్డుతొలగిస్తే రెండిళ్లు సొంతమవుతాయని సూచించాడు. గతేడాది డిసెంబరు 7న పీనానాయక్ ఉద్యోగ నిమిత్తం బయటకు వెళ్లాడు.దీన్ని అవకాశం చేసుకున్న సవతి తల్లి రవి, అతని స్నేహితుడు వీరన్నతో కలిసి మహేశ్వరి మెడకు చున్నీ బిగించి ఊపిరాడకుండా చేసి చంపారు. ఆమె మరణించినట్టు నిర్ధారించుకుని మృతదేహాన్ని గోనెసంచిలో మూటలా కట్టి కారులో తీసుకెళ్లి నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి సమీపంలో పాతిపెట్టారు. కుమార్తె గురించి అడిగిన భర్తకు ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారనే ఉద్దేశంతో మరో యువకుడితో వెళ్లిపోయి ఉంటుందని లలిత కట్టుకథ అల్లింది. ఈ విషయం బయటకు చెబితే పరువు పోతుందని భర్తను భయపెట్టింది. ఇదంతా నిజమని భావించిన పీనా నాయక్ కొద్దిరోజులు మౌనంగా ఉన్నాడు. నాలుగు నెలలైనా బిడ్డ ఆచూకీ తెలియకపోవ డంతో ఆందోళనకు గురై ఏప్రిల్ 2న మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో మహేశ్వరి కనిపించటం లేదంటూ ఫిర్యాదు చేశాడు.



## బుడగ జంగాల కుటుంబంలో భోజనం చేస్తున్న బీర్ల అయిలయ్య

బుడగ జంగాల కుటుంబంలో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సన్న బియ్యంతో భోజనం. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో బుడగ జంగాల కుటుంబంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు భోజనం చేశారు.ఈ సందర్భంగా వారి ఇంట్లో భోజనం చేస్తూ సన్నబియ్యం పథకంతో పాటు ఇతర పథకాలు ఎలా ఉన్నాయో మహిళలను అడిగి తెలుసుకున్నారు.ఈ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  మహిళలకు పెద్దపీట వేస్తునట్లు తెలిపారు.ఈ సన్నబియ్యం తింటూ ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

## జమ్మూకాశ్మీర్‌లో కాలేజీ బస్సు బోల్తా, విద్యార్థిని మృతి

జమ్మూకాశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హంద్వారాలో కాలేజీ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒక విద్యార్థిని మృతిచెందగా.. 23 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## పద్మశ్రీ అవార్డ్ గ్రహీత, వనజీవి రామయ్యకు గుండెపోటు.. చికిత్స పొందుతూ మృతి!

పద్మశ్రీ వనజీవి రామయ్య(87) కన్నుమూశారు. శనివారం(ఏప్రిల్ 12) తెల్లవారుజామున గుండెపోటుతో రామయ్య తుదిశ్వాస విడిచారు. దరిపల్లి రామయ్య.. వృక్షో రక్షతి రక్షితః అన్న సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించాడు. మొక్కలను బిడ్డలవలే పెంచారు. ఇంటిపేరునే వనజీవిగా మార్చుకొని కోట్లాది మొక్కలకు ప్రాణం పోశారు. జీవితాంతం మొక్కలు నాటి పేరు తెచ్చుకున్నారు. కోటికిపైగా మొక్కలు నాటి సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆయన సేవలకు గాను 2017లో కేంద్ర ప్రభుత్వం రామయ్యను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. పద్మశ్రీ వనజీవి రామయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈక్రమంలోనే ఖమ్మంలోని తన స్వగృహంలో ఈ ఉదయం మరోసారి అస్వస్థతకు



గురయ్యారు. దీంతో ఆయనను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. రామయ్య స్వస్థలం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామం. మొక్కల పట్ల ఆయనకు ఉన్న ప్రేమతో.. మొక్కల ప్రాధాన్యం తెలిపే బోర్డులను తాను అలంకరించుకొని నిత్యం పర్యావరణ పరిరక్షణకు పాటుపడ్డారు. 50 ఏళ్లుగా అలుపెరగకుండా విత్తనాలు చల్లుతూ మొక్కలు పెంచేందుకు ప్రయత్నించారు. వేసవిలో విత్తనాలు సేకరించి తొలకరి రాగానే వాటిని ఆయా ప్రాంతాల్లో చల్లుతుండేవారు వనజీవి రామయ్య. ఇలా 120 రకాల మొక్కల చరిత్రను అలవోకగా చెప్పగలరు వనజీవి. తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతిలో వనజీవి గురించి పాఠ్యాంశంలో చేర్చింది. మూడు కోట్ల మొక్కలు నాటాలన్నదే తన లక్ష్యమని వనజీవి రామయ్య చెప్తుండేవారు. రామయ్య మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

## పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం!

పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల సంతాపం తెలిపారు. రామయ్య మరణం సమాజానికి తీరని లోటని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రాగాడ సానుభూతి తెలియజేశారు. ప్రకృతి, పర్యావరణం లేనిదే మానవ మనుగడ లేదనే సిద్ధాంతాన్ని బలంగా నమ్మిన వ్యక్తి వనజీవి రామయ్య అని సీఎం రేవంత్ అన్నారు. ఆయన సూచించిన మార్గాలు నేటి యువతకు మార్గదర్శకం అని సీఎం రేవంత్ అన్నారు. పర్యావరణ రక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వనజీవి రామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రాస్థిస్తున్నట్టు సీఎం రేవంత్ తెలిపారు. ప్రకృతి ప్రేమికుడు, హరిత స్వాప్నికుడు, వనజీవి రామయ్య మృతి



సమాజానికి తీరని లోటుని మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వృక్షో రక్షతి రక్షితః అన్న సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా ఆచరించి, మొక్కలను బిడ్డలవలే పెంచిన వ్యక్తి రామయ్య అని హరీష్ రావు అన్నారు. రామయ్య మృతిపై అటు ఏపీ మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వనజీవి రామయ్య మరణం బాధాకరం అన్నారు. ''వృక్షో రక్షతి రక్షితః'' అన్న ఆయన జీవన సందేశమే ఆయన జీవిత సారాంశమని తెలిపారు. చెట్లను మన వంశపారంపర్యంగా భావించి, వాటిని సంరక్షించడం ద్వారా మన భవిష్యత్తును కాపాడతామని చెప్పిన ఆయన, అసలైన పర్యావరణ యోధుడని లోకేష్ తెలిపారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# పెరుసు రివ్యూ

తమిళంలో కామెడీ డ్రామా జోనర్లో రూపొందిన సినిమానే 'పెరుసు'. ఇళంగో రామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మార్చి 14వ తేదీన థియేటర్లకు వచ్చింది. వైభవ్ .. సునీల్ రెడ్డి ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ రోజు నుంచే 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కి వచ్చింది. తమిళంతో పాటు ఇతర భాషలలోను అందుబాటులోకి వచ్చింది. ఈ సినిమా కథేమిటనేది చూద్దాం. కథ: పరంధామయ్య ఓ మధ్య తరగతి కుటుంబీకుడు. ఆయన సంతానమే దొరబాబు (వైభవ్) స్వామి (సునీల్ రెడ్డి). దొరబాబుకు 'శాంతి'తో .. స్వామికి 'రాణి'తో వివాహం జరుగుతుంది. ఉమ్మడి కుటుంబమే అయినా వాళ్ల మధ్య పెద్దగా సఖ్యత ఉండదు. పరంధామయ్యకి కావలసినవన్నీ ఆయన భార్య 'భాగ్యం' దగ్గరే ఉండి చూసుకుంటూ ఉంటుంది. తన వయసువారైన స్నేహితులతో పరంధామయ్య కాలక్షేపం చేస్తూ ఉంటాడు. ఒక రోజున పరంధామయ్య హఠాత్తుగా చనిపోతాడు. ఈ విషయం తెలిసి కుటుంబ సభ్యులంతా ఇంటికి చేరుకుంటారు. ఆయన చనిపోయిన విషయం బంధు మిత్రులకు తెలియపరచాలనే అనుకుంటారు. కానీ పరంధామయ్య శవం ఇతరులు చూడటానికి ఇబ్బంది కలిగించేలా ఉంటుంది. అలా ఎందుకు జరిగిందనేది ఎవరికీ అర్థం కాదు. విషయం తెలిస్తే అందరూ ఆక్షేపిస్తారని ఆందోళన చెందుతారు. తమ కుటుంబ పరువు ప్రతిష్ఠలు దెబ్బతినకుండా శవానికి అంత్యక్రియలు జరిపించాలని నిర్ణయించుకుంటారు. అయితే శవం విషయంలో కుటుంబ సభ్యులు ఏదో దాస్తున్నారని భావించిన కొందరు, అదేమిటనేది కనుక్కోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. వాళ్లతో పరంధామయ్యకి ఉన్న పరిచయం ఏమిటి? ఆ సమస్య నుంచి ఆ కుటుంబ సభ్యులు ఎలా బయటపడతారు? అనేది కథ. విశ్లేషణ: ఇది ఒక ఉమ్మడి కుటుంబం చుట్టూ తిరిగే కథ .. ఒక పెద్దాయన మరణం చుట్టూ తిరిగే కథ. శవం చుట్టూ ఒక ఆసక్తికరమైన కథను అల్లుకుని దానిని వినోదభరితంగా ఆవిష్కరించడం అప్పుడప్పుడు జరుగుతూ వస్తోంది. అలాంటి ఒక కథనే




ఇది. సాధారణ స్థితిలో చనిపోతే ఫరవాలేదు .. కానీ ఏ మాత్రం అభ్యంతరకర స్థితి ఉన్నా అది ఇక ఆ కుటుంబ సభ్యులను నానా ఇబ్బంది పెట్టేస్తుంది. అలాంటి ఒక కథాంశం చుట్టూ ఈ సినిమా నడుస్తుంది. దర్శకుడు ఎంచుకున్న వినోదప్రధానమైన అంశం కొంతవరకూ నవ్వు తెప్పిస్తుంది. అయితే అందరూ కలిసి కూర్చుని చూస్తూ నవ్వుకోలేని పరిస్థితి ఉంటుంది. అదే ఈ సినిమా విషయంలో ఒక లోపంగా కనిస్తుంది. ఎవరికివారుగా చూస్తే మాత్రం ఎలాంటి ఇబ్బంది లేదు. అక్కడక్కడా నవ్వుకోవచ్చు. అయితే కథ మొత్తాన్ని ఒకే అంశం చుట్టూ తిప్పడం వలన, ఒకే విషయంపై సాగదీయడం వలన ఆడియన్స్ కి కాస్త అసహనం కలుగుతుంది. పనితీరు: దర్శకుడు పూర్తి స్థాయిలో ఈ కథకు కామెడీని కనెక్ట్ చేయడానికి ప్రయత్నించాడు. ప్రతి విషయంలో కామెడీ రాబట్టడానికి ప్రయత్నించడం మనకి తెలిసిపోతూనే ఉంటుంది. అయితే ఆ హాస్యాన్ని ఒక అభ్యంతరకరమైన అంశంతో .. అందుకు సంబంధించిన సన్నివేశాలతో ముడిపెట్టడం వలన అందరూ కలిసి చూసే అవకాశం లేకుండా పోయిన కంటెంట్ గా ఇది మిగిపోయింది. సత్యతిలకం కెమెరా పనితనం .. అరుణ్ రాజ్ నేపథ్య సంగీతం .. సూర్య కుమారగురు ఎడిటింగ్ గురించి పెద్దగా చెప్పుకోవడానికేమీ లేదు. ముగింపు: హాస్యభరితమైన కథల ప్రధానమైన ప్రయోజనం, కుటుంబ సమేతంగా వాటిని చూడగలిగినప్పుడే. అయితే ఆ హాస్యాన్ని ఏదైనా ఒక ఇబ్బందికరమైన అంశంతో ముడిపెట్టినప్పుడు, ఆ ప్రయోజనం నెరవేరకుండా పోయే ప్రమాదం ఉంటుంది. అలాంటి ఒక ప్రయత్నంగానే ఈ కంటెంట్ కనిపిస్తుంది.




## ఢిల్లీలో డస్ట్ స్టార్మ్..
# 205 విమానాలు ఆలస్యం

ఢిల్లీలో బలమైన డస్ట్ స్టార్మ్ వచ్చింది. తీవ్రంగా వీచిన గాలుల వల్ల.. విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వేల మంది ప్రయాణికులకు ఇబ్బంది పడ్డారు. సుమారు 205 విమానాలు ఆలస్యం అయ్యాయి. దాదాపు 50 విమానాలకు చెందిన నిర్దేశిత డెస్టినేషన్‌ను మార్చేశారు. సగటున ప్రతి విమానం గంట ఆలస్యంగా వెళ్తున్నట్లు తెలుస్తోంది. దుమ్ము తుఫాన్ రావడంతో అనేక విమానాలను డైవర్ట్ చేశారు. కొన్నింటిని రద్దుచేశారు. దీంతో విమానాల కోసం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఎదురుచూస్తున్న ప్రయాణికుల సంఖ్య పెరిగిపోయింది. విమానాలు డైవర్ట్ చేయడం వల్ల.. విమానాశ్రయంలో రష్ పెరిగినట్లు ఓ అధికారి తెలిపారు. ఎయిర్ ఇండియా, ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థలు తమ ప్రయాణికులకు అడ్వైజరీలు జారీ చేశాయి. శ్రీనగర్ నుంచి ఢిల్లీకి సాయంత్రం 6 గంటలకు రావాల్సిన విమానాన్ని.. డస్ట్ స్టార్మ్ వల్ల చండీఘడ్‌కు దారి మళ్లించారు. అయితే ఆ విమానం మళ్లీ రాత్రి 11 గంటలకు ఢిల్లీ చేరుకున్నది. దీంతో ప్రయాణికుల అవస్థలు పడినట్లు ఓ ఎయిర్ ఇండియా ప్యాసింజర్ తెలిపారు. ఢిల్లీ నుంచి ముంబైకి రాత్రి 12 గంటలకు వెళ్లాల్సిన విమానాన్ని కూడా ఆలస్యం చేశారు. నాలుగు గంటల పాటు విమానంలో కూర్చున్న తర్వాత మరో విమానంలోకి ఎక్కించారని, తెల్లవారినా కూడా తమ విమానం కదలడం లేదని మరో ప్యాసింజర్ చెప్పారు.



## ముంబయి దాడిలో ప్రాణాలకు తెగించి
# 20 మంది గర్భిణీలను కాపాడిన నర్సు

ముంబయి 26 /11 దాడుల కుట్రదారు తహవూర్ రాణాను భారత్‌కు అప్పగించడంపై బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముష్కరుల బీభత్సాన్ని ప్రత్యక్షంగా చూసినవారు ఆ పీడకల తమ కళ్లముందు ఇంకా కదలాడుతోందని చెబుతున్నారు. ఇక, తమ ప్రాణాలకు పలువుర్ని కాపాడిన కొందరు ఆ సమయంలో తాము ఎదుర్కొన్న ఒత్తిడిని నెమరువేసుకుంటున్నారు. అలాంటివారిలో ముంబయి కామా ఆసుపత్రిలో పనిచేసే నర్సు అంజలి కుల్తే ఒకరు. తమ ఆసుపత్రిలోని 20 మంది గర్భిణీ స్త్రీలను ఉగ్రదాడి నుంచి రక్షించడమే కాదు... అధిక రక్తపోటుతో బాధపడుతున్న ఓ గర్భిణికి సురక్షితమైన ప్రసవం జరిగేలా చూశారు. తాజాగా అంజలి కుల్తే ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. నవంబర్ 26న రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఛత్రపతి శివాజీ టెర్మినస్ స్టేషన్‌పై దాడి చేస్తున్న ఉగ్రవాదులు.. కామా ఆసుపత్రి వైపు కదులుతున్నారని తమకు సమాచారం అందిందని తెలిపారు. కొద్ది నిమిషాల తర్వాత ఆసుపత్రి వెనుక ఉన్న సందులో కాల్పుల శబ్దం విన్నామని చెప్పారు. 'కిటికీలో నుంచి చూస్తే, ఇద్దరు ఉగ్రవాదులు పరిగెత్తుకుంటూ రావడం.. పోలీసులు వారిపై కాల్పులు జరపడం కనిపించింది.. తరువాత ఉగ్రవాదులు గేటు దూకి ఆసుపత్రి ప్రాంగణంలోకి ప్రవేశించారు.. ఇద్దరు సెక్యూరిటీ గార్డులను వారు కాల్చి చంపడం నేను చూశాను.. కిటికీ వద్ద ఉన్న మమ్మల్ని గమనించి వారు మాపై కాల్పులు జరిపారు.. కాల్పుల్లో మా సిబ్బందిలో ఒకరు గాయపడ్డారు. నేను ఆమెను ఎమర్జెన్సీ విభాగానికి తీసుకెళ్లి, ఉగ్రవాదులు ఆసుపత్రిలోకి ప్రవేశించారని అందరికీ చెప్పాను' అని అంజలి వెల్లడించారు. 'అక్కడ నుంచి ప్రసూతి వార్డుకు తిరిగొచ్చి, మెయిన్ డోర్లు మూసివేసి, 20 మంది గర్భిణిలను ఓ చిన్న గదిలోకి తీసుకెళ్లాను.. సెల్‌ఫోన్‌లు, లైట్లు స్విచ్ ఆఫ్ చేసి.. వారు చీకటిలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. కొద్దిసేపటికే హైబీపీతో బాధపడుతున్న మహిళకు పురిటి నొప్పులు మొదలయ్యాయి... అప్పటికే ఆసుపత్రి లోపల కాల్పులు తీవ్రంగా జరుగుతుండటంతో ఆ వార్డుకు రావడానికి డాక్టర్ నిరాకరించారు... ఆమెను మెల్లగా గోడ పక్క నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రసూతి గదికి తీసుకెళ్లాను.. కొద్ది గంటల తర్వాత ఆమె ఒక ఆడ పిల్లను ప్రసవించింది.. ఆ శిశువుకు 'గోలీ' అని పేరు పెట్టారు.. ఆ రాత్రి ఐదు గంటల పాటు ఆసుపత్రిపై దాడి జరిగింది' అని తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులతో పాటు ఆసుపత్రి ఉద్యోగి కూడా చనిపోయారు.



## హాట్ ఫోజులిచ్చిన
# నేహా శెట్టి

ప్రెజెంట్ టాలీవుడ్ సినిమా దగ్గర కొత్త హీరోయిన్స్ కి అసలు ఎలాంటి కరువు లేదు. ఎప్పటికప్పుడు కొత్త సరుకు టాలీవుడ్ లో ఎంటర్ అవుతూనే వస్తుంది. మరి ఇదొక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుండగా ఇలా ప్రస్తుతం టాలీవుడ్ లో పలువురు యంగ్ అండ్ గ్లామరస్ హీరోయిన్స్ కూడా చాలా మంది ఉన్నారు. షోతో ఆడియెన్స్ ని పిచ్చెక్కించే హాట్ భామలు కొందరు ఉన్నప్పటికీ వారికి అనుకున్న రేంజ్ లో అవకాశాలు రావడం లేదనే చెప్పాలి. మరి ఇలాంటి సెన్సేషనల్ హాట్ బ్యూటీస్ లో తన కెరీర్ స్టార్టింగ్ లోనే ఓ రేంజ్ గ్లామర్ ని చూపించి కుర్రకారుని కట్టి పడేసిన నేహా శెట్టి కూడా ఒకామె అని చెప్పాలి. నేహా టాలీవుడ్ లోకి ఎంతోమంది గ్లామరస్ హీరోయిన్స్ ని టాలీవుడ్ కి పరిచయం చేసిన దర్శకుడు పూరి జగన్నాథ్ నుంచే తన చేసిన "మెహబూబా" సినిమాతో ఆమె లాంచ్ అయ్యింది.

## ప్రపంచంలో ఐదో స్థానం దక్కించుకున్న పరోటా

ప్రపంచ వ్యాప్తంగా పరోటాకు గుర్తింపు.. పరోటా దక్షిణ భారతదేశంలో ప్రాచుర్యం పొందిన లేయర్డ్ బ్రెడ్. ఇది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. టేస్ట్ అట్లాస్ అనే ప్రముఖ ఫుడ్ వెబ్‌సైట్ ప్రపంచంలోని టాప్ 100 వీధి ఆహారాల్లో పరోటాను ఐదవ స్థానంలో ఉంచింది. తమిళనాడు, కేరళ, శ్రీలంక వంటి ప్రాంతాల్లో పరోటా చాలా ప్రాచుర్యం పొందింది. దీన్ని మైదా పిండి, ఉప్పు, కొంచెం చక్కెర, నూనెతో తయారు చేస్తారు. ఇది లేయర్‌లతో కూడిన బ్రెడ్‌లా ఉంటుంది. వీధుల్లో విక్రయించే పరోటాకు ఎంతో మంది అభిమానులు ఉన్నారు. చనా లేదా మసాలా గ్రేవీతో దీన్ని ఎక్కువగా వడ్డిస్తారు. టేస్ట్ అట్లాస్ విడుదల చేసిన ప్రపంచంలోని ఉత్తమ వీధి ఆహారాల జాబితాలో పరోటా ఐదవ స్థానంలో నిలిచింది. ఇది భారతదేశపు రుచుల వైవిధ్యాన్ని చూపుతుంది. పరోటా వంటి వంటకాలు ఇప్పుడు దేశం బయట కూడా గుర్తింపు పొందుతున్నాయి. మలేషియా రోటీ కనై మొదటి స్థానంలో నిలిచింది. చైనీస్ గుటీ రెండవ స్థానంలో ఉంది.



## అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం పిల్లల కోసం తల్లి సాహసం

తాము నివాసం ఉండే అపార్ట్‌మెంట్ భవనంలోని ఆరో అంతస్తులో మంటలు చెలరేగడంతో.. ప్రమాదం నుంచి తన పిల్లలను కాపాడుకోడానికి ఓ మహిళ పెను సాహసం చేసింది. ముందుగా తన పిల్లలను బాల్కనీలో నుంచి కిందకు వదిలి.. కింద ఉన్నవారిని రక్షించమని కోరింది. అనంతరం ఆమె సైతం బాల్కనీ నుంచి వేలాడుతూ ఇద్దరు వ్యక్తుల సాయంతో కిందకు దిగి ప్రాణాలను కాపాడుకుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోను వైఎస్ఆర్సీపీ రాజ్యసభ సభ్యుడు పరిమల్ నత్వానీ షేర్ చేశారు.వివరాల్లోకి వెళ్తే.. అహ్మదాబాద్‌లోని ఖోఖ్రా ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్ భవనంలో మంటలు చెలరేగాయి. ఆరో అంతస్తులో దట్టమైన పొగలు వ్యాపించడంతో అపార్ట్‌మెంట్‌లో ఉన్నవారు భయంతో వణికిపోయారు. ఈ క్రమంలో ఆరో అంతస్తులోని ఉన్న మహిళ.. సమయస్ఫూర్తితో వ్యవహరించిన తన పిల్లలను రక్షించుకుంది. ఆమె మొదట చిన్న కుమార్తెను గాల్లోకి వదిలి రక్షించమని స్థానికులను కోరింది. స్థానికులు ఆ చిన్నారిని సురక్షితంగా పట్టుకున్నారు. ఆ తరువాత పెద్ద కుమార్తెను కూడా అదే విధంగా కిందికి జారవిడిచింది. ఆపై తను కూడా బాల్కనీ నుండి వేలాడుతూ ఇద్దరు వ్యక్తుల సహాయంతో ప్రాణాలు కాపాడుకుంది.

## ఆక్నూర్ సెక్టార్‌లో ఎన్‌కౌంటర్.. ఆర్మీ జేసీవో మృతి

జమ్మూకశ్మీర్‌లోని అక్నూర్ సెక్టార్ వద్ద ఉన్న నియంత్రణ రేఖ దగ్గర ఎదురుకాల్పులు జరిగాయి. ఆ ఎన్‌కౌంటర్‌లో ఆర్మీకి చెందిన జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్ ప్రాణాలు కోల్పోయాడు. అయితే చొరబాటుకు ప్రయత్నించిన




ఉగ్రవాదుల్ని తిప్పికొట్టారు. కేరీ బత్తల్ ఏరియా వద్ద ఉన్న ఓ నది సమీపంలో భారీ ఆయుధాలతో ఉగ్రవాదులు చొరబడేందుకు ప్రయత్నించారు. అలర్ట్‌గా ఉన్న ఆర్మీ వారి కదలికలపై కన్నేసింది. ఆ ఉగ్రమూకలపై సైన్యం ఎదురుకాల్పులు చేసింది. తొలుత గాయపడ్డ జేసీవో ఆ తర్వాత ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని అదనపు బలగాలతో కార్డన్ చేశారు. ఉగ్రవాదుల ఏరివేతకు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అక్నూర్ సెక్టార్ వద్దే ఫిబ్రవరి 11వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఆర్మీ జవాన్లు మృతిచెందారు. ఉగ్రవాదులు ఐఈడీ పేల్చడంతో ఓ కెప్టెన్ కూడా ప్రాణాలు కోల్పోయాడు. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో తాజా ఇండోపాక్ బ్రిగ్రేడ్ కమాండర్ స్థాయి మీటింగ్ జరిగిన తర్వాత ఎన్‌కౌంటర్ జరగడం శోచనీయం.